సాక్షి సూర్యాపేట

గురువారం । 8 । ఆగస్టు । 2024



భూ సమస్యలు ఏకరువు
సంవత్సరాలు గుడుస్తున్నా భూ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. - 8లో



డబ్బుతో ఉడాయించిన..
అప్పు ఇప్పిస్తామని, వడ్డీ ముందే ఇవ్వాలని నమ్మించి డబ్బు తీసుకుని పరారైన ముఠా పోలీసులకు చిక్కింది. - 8లో



రూ.29 లక్షలు స్వాహా
మహిళా సంఘాల డబ్బు రూ29 లక్షలను ఎస్‌బీఐ బ్యాంకు సీఎస్‌పీ నిర్వాహకుడు స్వాహా చేశాడు. - 8లో

న్యూస్‌రీల్

10.9 మి.మీ సగటు వర్షపాతం నమోదు

భానుపురి (సూర్యాపేట): జిల్లా వ్యాప్తంగా బుధవారం చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం పడింది. బుధవారం ఉదయం 8.30గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సరాసరి 10.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నూతనకల్ మండలంలో 32.0 మి.మీ, అత్యల్పంగా పాలకవీడు మండలంలో 1.3మి.మీ వర్షం పడింది. జాజిరెడ్డిగూడెంలో 25.0, ఆత్మకూర్ ఎస్‌లో 23.8, మద్దిరాలలో 22.0, చింతలపాలెంలో 16.5, మోతెలో 15.8, తుంగతుర్తిలో 15.8 మి.మీ వర్షం కురిసింది. నాగారం మండలంలో 14.9 మి.మీ, తిరుమలగిరిలో 10.3, సూర్యాపేటలో 9.8, కోదాడలో 9.0, అనంతగిరిలో 8.9, నడిగూడెంలో 7.3, చిలుకూరులో 6.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షం పడింది. ఈ వర్షంతో జిల్లాలో వరి సాగు పనులు ముమ్మరమయ్యాయి.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ పాల్ రాజు

తుంగతుర్తి: విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ పాల్ రాజు అన్నారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బుధవారం తుంగతుర్తి మండల కేంద్రంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్ మిల్లుల యాజమాన్యాలు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలన్నారు. బకాయిలు చెల్లించకపోతే వెంటనే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాసరావు, ఏఈ శ్రీనివాస్, సురేందర్ మిల్లర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం



ఏపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు

ఆత్మకూర్(ఎస్): పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని జెడ్పీ సీఈఓ అప్పారావు అన్నారు. బుధవారం ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ఏపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీళ్ల ట్యాంకును కడిగి మూతలు పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.డీ హసీం, ఎంఈఓ ధారాసింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు



వెన్నెల నాగరాజు

భానుపురి (సూర్యాపేట): తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా వెన్నెల నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పల్లెల రాములు, ప్రధాన కార్యదర్శిగా గంట భిక్షపతి, సహాయ కార్యదర్శిగా మాగి శంకర్, కోశాధికారిగా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెన్నెల నాగరాజు ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీలపై పాటలు రాసి యూట్యూబ్ వీడియోల ద్వారా ప్రజలకు మరింత చేరువ చేస్తామన్నారు.

20న దివ్యాంగ విద్యార్థులకు శిబిరం

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఈనెల 20న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు డీఈఓ కె.అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి 40 శాతం కన్నా ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగ పిల్లలు ఈ శిబిరానికి రావొచ్చని సూచించారు. ఎంఈఓ సంతకంతో సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌కాపీ, అలాగే యూడీఐడీ కార్డు జిరాక్స్, రిజిస్ట్రేషన్ పత్రం, ఇన్‌కం, రేషన్ కార్డు, వైకల్యం కనిపించేలా రెండు పాస్‌ఫొటోలు తీసుకురావాలని కోరారు.



18 గేట్ల నుంచి పరవళ్లు

సాగర్ జలాశయానికి బుధవారం రాత్రి 9 గంటలకు 3,51,844 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 2,71,705 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదవుతోంది. నీటిమట్టం 584.90 అడుగులు (297.1465 టీఎంసీలు)గా ఉంది.

ఐటీ హబ్‌పై ఆశలు



బీఆర్‌ఎస్ హయాంలో సూర్యాపేటలోని పాత కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేసిన ఐటీ హబ్

- సూర్యాపేటలో ఏడాది క్రితం ఐటీ హబ్ ప్రారంభం
- అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో ఆగిన ప్రక్రియ
- కొత్త ప్రభుత్వం ఏర్పడినా నిరాదరణ
- పునఃప్రారంభానికి ఎన్‌ఆర్‌ఐ తీవ్ర ప్రయత్నం
- అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రిని కలిసి విన్నపం

సూర్యాపేట : ఐటీ హబ్ నిర్వహణపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఏడాది క్రితం గత ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలో ఐటీహబ్‌ను ప్రారంభించారు. మొదటి విడత కొందరిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ దీని నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. స్థానికంగా ఎన్‌ఆర్‌ఐ రజనీకాంత్ సంగాని .. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఐటీహబ్‌ను పునఃప్రారంభించాలని కోరడంతో ఇక్కడి ఐటీ ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రెండేళ్ల పాటు కృషి..

సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన సెంటిప్రోస్ సంస్థ నిర్వాహకుడు, ఎన్‌ఆర్‌ఐ రజనీకాంత్ సంగాని తన పుట్టిన గడ్డకు ఏదైనా చేయాలన్న పట్టుదలతో ఉన్నారు. పేటలో ఐటీ సేవలను తీసుకురావాలని భావించగా.. సరిగ్గా ఇదే సమయంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టణాల్లోనూ ఐటీ హబ్‌ల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. రెండేళ్ల పాటు రజనీకాంత్ సంగాని ఈ హబ్ ఏర్పాటుకు కృషి చేసి ఐటీ కంపెనీలు ఇక్కడికి వచ్చేలా ప్రయత్నాలు చేశారు. ఈ ప్రయత్నంలో యూఎస్‌ఏ నుంచి అనేక కంపెనీలు స్థానికంగా వచ్చేందుకు అంగీకారం తెలపడం, మొదట 10 కంపెనీలు హామీ ఇవ్వడంతో ఐటీ హబ్ ఏర్పాటుకు అప్పట్లో మార్గం సుగమం అయ్యింది.

గతంలో ప్రణాళిక ఎలా రూపొందించారంటే..

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలో 2023 ఆగస్టు మాసంలో అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఐటీ హబ్‌ను ప్రారంభించారు. 15 కంపెనీలు సెప్టెంబర్ లో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 4,212 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. 350 మందిని మొదటి విడత ఎంపిక చేసి వీరిలో 70 మందికి మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. అనంతరం 600 మందిని ఎంపిక చేసి షిఫ్ట్‌కు 300 మంది చొప్పున మూడు షిఫ్టుల్లో విధులకు హాజరయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. శిక్షణ పూర్తయిన వెంటనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఐటీ హబ్ కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. ఎన్నికల అనంతరం కొంత ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఐటీ హబ్ నిర్వహణ ప్రక్రియ ముందుకు సాగడంలేదు.

సానుకూలంగా స్పందించారు

ముఖ్యమంత్రి అమెరికా పర్యటన గురించి సూర్యాపేట మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రామసాని శ్రీనివాస నాయుడు నాకు సమాచారం ఇచ్చారు. సూర్యాపేటలో ఐటీ హబ్ పునఃప్రారంభ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వివరించాను. వారు సానుకూలంగా స్పందించారు. త్వరలో ఇది కార్యరూపం దాలుస్తుందని ఆశిస్తున్నా.

– రజనీకాంత్ సంగాని

ముందడుగు పడేనా..

సెంటిప్రోస్ సంస్థ నిర్వాహకుడైన రజనీకాంత్ సంగాని ఈ ఐటీ హబ్‌ను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ముఖ్యమైన ఐఏఎస్ అధికారులను కలిసి వివరించారు. రెండేళ్ల పాటు కృషి చేశానని, 10 కంపెనీలు రావడానికి సుముఖంగా ఉన్నాయని నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించే అవకాశం ఏర్పడిందని వివరించారు. సూర్యాపేట రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య, హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో ఉన్న పట్టణమని, ఉపాధి అవకాశాల కోసం ఈ పట్టణం సరైందని భావించి ఏర్పాటు చేసినట్లు ఆయన ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. స్పందించిన సీఎం.. ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌తో మాట్లాడారు. సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆ తర్వాత ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతోనూ రజనీకాంత్ మాట్లాడి సూర్యాపేట ప్రాధాన్యత, అవకాశాలు వివరించారు. ఐటీ హబ్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది.





అమెరికాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబును కలిసి సూర్యాపేట ఐటీహబ్‌ను పునః ప్రారంభించాలని కోరుతున్న రజనీకాంత్ (ఫైల్)

విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు

- ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్: అన్ని విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇది అమానుష చర్యని, తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం, వారిని ఇబ్బందులకు గురి చేయడం మంచి విద్యార్థి లక్ష్యం కాదని పేర్కొన్నారు. విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనే తేడా లేకుండా స్నేహపూర్వకంగా కలిసిమెలిసి విద్యనభ్యసించాలని సూచించారు. ర్యాగింగ్ లాంటి కేసుల్లో ఇరుక్కుంటే బంగారు భవిష్యత్తు కోల్పోతారని పేర్కొన్నారు. ర్యాగింగ్ కు పాల్పడే వారి వివరాలను డయల్ 100 కు తెలియజేసి పోలీసు సహాయం పొందవచ్చని కోరారు.



ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

డీఐఈఓగా భానునాయక్ బాధ్యతల స్వీకరణ



డీఐఈఓ భానునాయక్‌కు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ యాదయ్య, అధ్యాపకులు

సూర్యాపేటటౌన్ : జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐఈఓ)గా వి.భానునాయక్ గురువారం జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఐఈఓగా పనిచేస్తున్న జానపాటి కృష్ణయ్య భానునాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. భానునాయక్‌కు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యాదయ్య, సీనియర్ అధ్యాపకులు వీడీఎస్ ప్రసాద్, వాసు, గుర్వయ్య, నవీన్‌కుమార్, శ్రీనివాస్ పూలబొకే అందజేసి స్వాగతం పలికారు.

డీఐఈఓకు సన్మానం..

డీఐఈఓగా బాధ్యతలు స్వీకరించిన వి.భానునాయక్‌కు టీజీజేఎల్‌ఏ ఆధ్వర్యంలో పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఇప్పటి వరకు బాధ్యతల్లో ఉన్న డీఐఈఓ జానపాటి కృష్ణయ్యను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గునగంటి వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాస్, మద్దిమడుగు సైదులు, ప్రసాద్, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

స్వచ్ఛదనం–పచ్చదనంలో పాల్గొనాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



చివ్వెంల రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్

చివ్వెంల: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పిలుపునిచ్చారు. బుధవారం చివ్వెంల మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలు, పట్టణాల్లో దోమల ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా బహిరంగ ప్రదేశాలు, వీధులు, ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. రోడ్లమీద గుంతలు ఉంటే గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియజేస్తే వారు పూడ్చి సమస్యను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. దీనిపై అధికారుల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అంతకు ముందు చివ్వెంల రైతు వేదికలో రైతు బీమా, పంటల నమోదు, రైతు రుణమాఫీపై ఏఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి రుణమాఫీ కాని రైతుల వివరాలను ఉన్నతాధికారులు, బ్యాంకర్లకు తెలియజేయాలని సూచించారు. అనంతరం ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫైలేరియాతో బాధపడుతున్న గ్రామానికి చెందిన వెంకులు, కరుణమ్మతో మాట్లాడారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాణికి సరైన చికిత్స అందించాలని కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జగదీష్‌రెడ్డి, డీఎల్‌పీఓ నారాయణరెడ్డి, ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఏఈ ఆశాకుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో డీఈఓ

భానుపురి (సూర్యాపేట): పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటుకు సహకరించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కోరారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో మండల విద్యాధికారులు, కోఆర్డినేటర్లు, మండల నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల రోజువారీ హాజరు మెరుగుపర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విద్యార్థులకు రెండో జత యూనిఫామ్ వారం రోజుల్లోగా అందజేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా చేపట్టిన మైనర్ రిపేర్లు సకాలంలో పూర్తి చేస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. విద్యార్థులు ధారాళంగా చదవడం, రాయడం ప్రాక్టీస్ చేయాలన్నారు. క్రమం తప్పకుండా వర్క్ షీట్లు, ఇంటి పని ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు వచ్చే సోమవారం నుంచి క్రమం తప్పకుండా ఐదు ఆంగ్ల నూతన పదాలను పరిచయం చేయాలని, స్పెల్లింగ్, అర్థం, ఒక వాక్యం రాయడం రావాలని చెప్పారు. అదే వారంలో శనివారం దానికి సంబంధించిన పరీక్ష నిర్వహించాలని సూచించారు. జాలి ఫోనిక్స్ అనే స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం చేసుకొని జిల్లాలోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు మూడు, నాలుగు విడతలుగా మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈఓ అశోక్ , కోఆర్డినేటర్లు, మండల విద్యాధికారులు, మండల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎడమకాల్వ విద్యుదుత్పాదన కేంద్రంలో ఆగిన టర్బైన్

నాగార్జునసాగర్: సాగర్ జలాశయం నుంచి లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా వెళుతున్నప్పటికీ జెన్‌కో అధికారుల నిర్లక్ష్య వైఖరితో రికార్డు స్థాయిలో విద్యుదుత్పాదన జరగడంలేదు. ఎడమ కాల్వపై గల విద్యుదుత్పాదన కేంద్రంలో 60మెగావాట్ల సామర్థ్యంగల రెండు యూనిట్లు ఉన్నాయి. అందులో ఒక టర్బైన్ మాత్రమే తిరుగుతుండటంతో ఉత్పాదన సగం మాత్రమే అవుతోంది. నిత్యం 0.7 మెగావాట్ల విద్యుదుత్పాదన జరగాల్సి ఉండగా సగం కూడా కావడంలేదు. 18 సెప్టెంబర్ 2014న అర్ధరాత్రి పెన్‌స్టాక్ పనిచేయక పోవడంతో సర్జ్‌పూల్ నుంచి వచ్చిన నీటితో టర్బైన్ నీట మునిగింది. సంవత్సరం పాటు మరమ్మతులు చేయించారు. ఈ సమయంలోనే సర్జ్‌పూల్‌లోకి దిగిన గజ ఈతగాడు మృతిచెందాడు. అనంతరం 2015లో రన్నింగ్ చేశారు. తిరిగి 2022 డిసెంబర్‌లో ఆగింది. తిరిగి మరమ్మతులు చేయించారు. ఈ నెల 5వ తేదీన రన్ చేయగా ఐదు నిముషాలు తిరిగి ఆగిపోయింది. 2014 నుంచి ఈ టర్బైన్ ఏనాడూ సక్రమంగా పనిచేయలేదని ఉద్యోగులు తెలిపారు. దీనిపై జెన్‌కో ఎస్ఈ రఘురాంను వివరణ కోరగా మరమ్మతులు చేస్తున్నాం త్వరలో రన్ చేస్తామని తెలిపారు. అలాగే, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో 8 యూనిట్లకుగాను రెండవ యూనిట్ నడవడం లేదు.



ఎడమ కాల్వపై గల విద్యుదుత్పాదన కేంద్రం లోని టర్బైన్‌లోకి నీరు చేరిన తీరు(ఫైల్)

నిండుగా కృష్ణమ్మ



పాలకవీడు మండలం మహంకాళిగూడెం వద్ద కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి సుమారు 3 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో కృష్ణాతీర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మహంకాళిగూడెం వద్ద పుష్కరఘాట్ మునిగింది. - పాలకవీడు

రేషన్‌కార్డులకు మోక్షం!

- కొత్త కార్డుల జారీకి ఇటీవల రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం
- లబ్ధిదారుల్లో చిగురిస్తున్న ఆశలు
- 28వేల దరఖాస్తులు పెండింగ్

ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన దేగల రాజుకు 2016లో వివాహం అయ్యింది. ఇతనికి ఇద్దరు పిల్లలు. ఇప్పటి వరకు రేషన్ కార్డులేదు. నాలుగైదు సార్లు దరఖాస్తు చేసుకున్నా ప్రభుత్వం కార్డు జారీ చేయలేదు. రేషన్‌కార్డు లేకపోవడంతో మూడో విడత చేపట్టే రూ.2లక్షల రుణమాఫీ అవుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నాడు.



భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో రేషన్‌కార్డులు లేని నిరుపేదల కష్టాలు అన్నీఇన్నీ కావు. ఏ పథకానికైనా రేషన్ కార్డును ప్రమాణికంగా తీసుకోవడంతో అర్హులైన లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వం నూతనంగా కార్డులు జారీ చేయకపోవడంతో దాదాపు తొమ్మిదేళ్లుగా ఎదురు చూపులే మిగిలాయి. రేషన్‌కార్డుల జారీకోసం ఇటీవల రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో జిల్లా ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

కార్డులు లేక అవస్థలు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2015లో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసింది. ఆ తర్వాత ఉపఎన్నికలు వచ్చిన సమయంలో రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించినా ఆ ఊసేలేదు. ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయిన వారు, పెళ్లిళ్లు అయిన వారు కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు వారికి ఒకే రేషన్ కార్డు ఉండడం, అందులో భర్త పేరు ఒక కార్డులో, భార్య పేరు మరొక కార్డులో.. పిల్లల పేర్లు ఏ కార్డుల్లో లేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు హైదరాబాద్, చెన్నై, సూరత్ తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లి కరోనా తర్వాత సొంత గ్రామాలకు వచ్చారు. ప్రస్తుతం వారికి రేషన్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం అందడం లేదు. అలాగే ఆరోగ్యశ్రీ సేవలకు దూరమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందించే సబ్సిడీ గ్యాస్, ఉచిత విద్యుత్‌తో పాటు, రైతు రుణమాఫీలో కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కొత్తగా 50వేల కుటుంబాలకు పైగా..

సూర్యాపేట జిల్లాలో ప్రస్తుతం 3లక్షలకు పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. అలాగే అంత్యోదయ కార్డులు 19,828, అన్నపూర్ణ కార్డులు 36 ఉన్నాయి. గతంలో రేషన్ కార్డుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. సుమారు 28వేల మంది కొత్త కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మరో 52వేల మంది తమ పిల్లల పేర్లను కార్డుల్లో చేర్పించేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజా పాలనలోనూ మరికొందరు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం కార్డులు జారీ చేస్తే జిల్లాలో 50వేలకు పైగా కుటుంబాలకు మేలు కలగనుంది.

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ లీకై ముగ్గురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చిలుకూరు: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ లీకై ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం చిలుకూరు మండలంలోని పాత కొండాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెరిగె గురవయ్య ఇంట్లో ఉదయం ఆయన కోడలు వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ సిలిండర్ లీకైంది. దీంతో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న గురవయ్యతోపాటు, కుమారుడు అరుణగోపాల్, కోడలు శిరీషకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శిరీష పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు. బాధితులు ఎలాంటి ఫిర్యాదు అందించకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ సురభి రాంబాబు గౌడ్ తెలిపారు. కాగా.. శిరీష ప్రస్తుతం ఆరు నెలల గర్భిణి. గురవయ్య కుమారుడు, కోడలు హైదరాబాద్‌లో ఉంటూ మంగళవారం రాత్రే కొండాపురంలోని తన నివాసానికి వచ్చారు.

యాదాద్రి హుండీ ఆదాయం రూ.2.66కోట్లు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, నగలను కొండ కింద గల శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి సమక్షంలో బుధవారం ఆలయాధికారులు, సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.2,66,68,787 నగదు, 87గ్రాముల మిశ్రమ బంగారం, 3కిలోల 300 గ్రాముల మిశ్రమ వెండి లభించినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఈ ఆదాయం 30 రోజులదని వివరించారు.

కొనసాగుతున్న నీటి విడుదల

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి వద్ద గల టెయిల్‌పాండ్ నుంచి దిగువకు నీటి విడుదల బుధవారం కూడా కొనసాగుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు జలాశయం నుంచి టెయిల్ పాండ్‌కు 2,78,761 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా దిగువకు 2,76,960 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

2,67,491 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. నాగార్జునసాగర్, టెయిల్‌పాండ్‌ల నుండి భారీగా నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం 9 గేట్ల ద్వారా నీటిని విడుదల చేయగా వరద ఉధృతి మరింత పెరగడంతో బుధవారం 13 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోని 6 గేట్లను 2.5 మీటర్లు, 7 గేట్లను 3 మీటర్లు పైకి ఎత్తి 2,88,064 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన నాగార్జు సాగర్ నుంచి 2,67,491 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 36.37 టీఎంసీల నీరు ఉంది. రిజర్వాయర్ నీటిమట్టం 53.34 మీటర్లు కాగా ప్రస్తుతం 51.38 మీటర్లు ఉంది.

4 యూనిట్ల ద్వారా విద్యుత్

పులిచింతల ప్రాజెక్టులో బుధవారం నాలుగో యూనిట్ విద్యుత్ ఉత్పత్తిని అధికారులు ప్రారంభించారు. వీటి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 120 మెగావాట్లు. ప్రస్తుతం 15వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 80 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. విద్యుత్‌ను తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ఎస్‌ఈ దేశ్యా నాయక్ తెలిపారు.

కృష్ణా తీరంలో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్ : సాగర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు తిలకించేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఆ మనోహర దృశ్యాన్ని సెల్‌ఫోన్లలో బంధించడంతోపాటు సెల్ఫీలు దిగారు. కొత్త బ్రిడ్జి దగ్గర నుంచి శివాలయం వెంట విద్యుదుత్పాదన కేంద్రం వరకు పర్యాటకులు బారులుదీరి ప్రకృతి అందాలను తిలకిస్తూ గడిపారు.



నదీతీరంలో బారులు తీరిన వాహనాలు



నాగార్జునసాగర్ జలాశయంలో లాంచీలో విహరిస్తున్న రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి



సెల్ఫీ తీసుకుంటున్న పర్యాటకులు

డబ్బుతో ఉడాయించిన ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు.. పరారీలో మరో ఆరుగురు
- రూ.60 లక్షల నగదు, మినీ కౌంటింగ్ మిషన్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్



కేసు వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మిర్యాలగూడ అర్బన్: ఐదు కోట్ల రూపాయల అప్పు ఇప్పిస్తామని ఓ ముఠా నమ్మబలికి బాధితుల నుంచి వడ్డీ ముందే ఇవ్వాలని చెప్పి ఆ డబ్బులతో పరారుకాగా వారిని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సమీరా నిజామాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించి డబ్బులు అవసరం కావడంతో శ్రీకాంత్ అనే మధ్యవర్తి ద్వారా మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కండెల గణేష్, మల్లికార్జున్‌లను సంప్రదించాడు. ముందుగా అనుకున్న ప్రకారం రూ.5 కోట్లు అప్పుగా ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుని గత నెల 31వ తేదిన సమీర్‌ను నమ్మించడానికి రూ.90 లక్షలు అప్పుగా ఇచ్చి అతడి నుంచి బ్లాంక్ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, ఇంటి కాగితాలు తీసుకున్నారు. ఆ తరువాత మిగిలిన డబ్బుల విషయమై గణేష్, మల్లికార్జున్‌లను సంప్రదించగా అప్పుగా ఇచ్చే డబ్బులకు ముందుగానే వడ్డీ చెల్లించాలని వారు సూచించారు. దీంతో సమీర్ తన వ్యాపార భాగస్వాములతో కలిసి ముందుగా వారు ఇచ్చిన రూ.90 లక్షలతో పాటు మరో రూ.60 లక్షలు కలిపి ఈ నెల 5వ తేదీన మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో గల వీరన్న ఇంటికి వచ్చాడు. అప్పటికే పథకం ప్రకారం వీరన్న ఇంటి వద్ద ఉన్న నిందితులు గణేష్, మల్లికార్జున్, విజయ్, రాజు, అనుపమ, వెంకటమ్మ, వీరమ్మ ముందుగా రూ.90లక్షలు తీసుకుని వారు తీసుకున్న చెక్కులు, ప్రామిసరీనోట్లు, ఇంటి కాగితాలు తిరిగి సమీర్‌కు ఇచ్చారు. రూ.5 కోట్ల గురించి అడగ్గా వడ్డీ ఇవ్వాలని నిందితులు అడగడంతో డబ్బుల బ్యాగ్‌ను చూపించాడు. దీంతో ఒక్కసారిగా సమీర్ అతడి వ్యాపార భాగస్వాములపై దాడి చేసి రూ.60 లక్షల బ్యాగ్‌తో అక్కడి నుంచి ఉడాయించారు. తేరుకున్న బాధితులు డయల్ 100 కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో పాటు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు.

మూడు టీంల ఏర్పాటు..

విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ సుధాకర్, ఎస్‌ఐ శేఖర్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డీఎస్పీ కె.రాజశేఖర రాజు ఆదేశాలతో టూ టౌన్ సీఐ నాగార్జున వారి సిబ్బంది, రూరల్ పోలీసులు మొత్తం మూడు ప్రత్యేక బృందాలతో రంగంలోకి దిగి సోదాలు నిర్వహించారు. ఈమేరకు మిర్యాలగూడ పట్టణంలో బుధవారం అనుపమ, వీరమ్మ, గంగమ్మలు పట్టుబడగా వారిని అరెస్టు చేసి వారి నుంచి రూ.60 లక్షల నగదు, మినీ కౌంటింగ్ మిషన్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఏ1 కండెల గణేష్, ఏ2 మల్లికార్జున్, ఏ3 విజయ్, ఏ4 రాజు, ఏ5 వీరన్న, ఏ6 గంగమ్మలు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన డీఎస్పీ రాజశేఖర్, సీఐలు సుధాకర్, నాగార్జున, ఎస్‌ఐలు శేఖర్, నరేష్‌లను అభినందించారు.

మహిళా సంఘాల డబ్బు రూ.29 లక్షలు స్వాహా

- మహిళలు చెల్లించిన సొమ్మును వాడుకున్న ఎస్‌బీఐ సీఎస్‌పీ నిర్వాహకుడు

చిట్యాల: మహిళా స్వయం సహాయక సంఘాల డబ్బులను ఎస్‌బీఐ బ్యాంకు సీఎస్‌పీ (కస్టమర్ సర్వీస్ పాయింట్) నిర్వాహకుడు దుర్వినియోగం చేసిన సంఘటన చిట్యాలలో ఆలస్యంగా వెలుగు చూసింది. చిట్యాల పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో చౌటుప్పల్‌కు ఓ వ్యక్తి సీఎస్‌పీ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆ సెంటర్‌లో చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి, ఆరెగూడెం, పిట్టంపల్లి గ్రామాలకు చెందిన స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు తాము తీసుకున్న రుణాలను తిరిగి నెలవారీగా చెల్లిస్తుంటారు. ఇటీవల ఆ గ్రామాలకు చెందిన ఓ సంఘం సభ్యురాలు తమకు తిరిగి రుణం కావాలంటూ సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) కార్యాలయంతో పాటు బ్యాంకులో సంప్రదించింది. దీంతో ఆమె బ్యాంకు లావాదేవీలను పరిశీలించిన బ్యాంకు సిబ్బంది ఆమె లీడర్‌గా ఉన్న సంఘం గతంలో తీసుకున్న రుణానికి చెల్లించాల్సిన డబ్బులు పెడింగ్‌లో ఉన్నట్లు గుర్తించి.. కొత్త రుణం ఇవ్వటం కుదరదని తెలిపారు. తాము ప్రతినెలా సీఎస్‌పీ సెంటర్‌లో డబ్బులు చెల్లిస్తున్నామని, తమ వద్ద రసీదులు కూడా ఉన్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని సుమారు 35 మహిళా సంఘాలకు సంబంధించి సుమారుగా రూ.29లక్షలు దుర్వినియోగం అయినట్లు సెర్ప్, బ్యాంకు అధికారులు గుర్తించారు. ఈ మెరకు సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకుడు వెంకటేష్‌ను నిలదీయగా డబ్బులు వాడుకున్నట్లు ఒప్పుకొని తిరిగి చెల్లించేట్లుగా సెర్ప్ అధికారులకు లెటర్‌ను వ్రాయించి ఇచ్చినట్లు తెలుస్తోంది. జరిగిన డబ్బుల దుర్వినియోగంపై సెర్ప్ ఏపీఎం పద్మను వివరణ కోరగా.. మహిళా సంఘాల డబ్బులను సీఎస్‌పీ సెంటర్ నిర్వాహకుడు వాడుకుంటున్నట్లు తెలిపారు. డబ్బులను రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆమె తెలిపారు. సీఎస్‌పీ సెంటర్‌లో డబ్బుల దుర్వినియోగంపై చిట్యాల ఎస్‌బీఐ మేనేజర్ వరప్రసాద్ వివరణకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

పుట్టపాక స్టాల్‌ను సందర్శించిన మంత్రి సీతక్క



స్టాల్‌ను సందర్శించిన మంత్రి సీతక్క

సంస్థాన్ నారాయణపురం: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన చేనేత వస్త్ర ప్రదర్శనలో పుట్టపాక ఉమెన్స్ హ్యాండ్లూమ్స్ ఇక్కత్ ప్రొడక్ట్స్ సొసైటీ స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పుట్టపాక చేనేత చీర కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామల భాస్కర్, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షురాలు సామల విజయలక్ష్మి, యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలీ మహిళా సంఘం అధ్యక్షురాలు గజం పుష్పలత, సామల హర్షిత్ తదితరులున్నారు.

హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక..

- స్కూల్ నుంచి పరారైన విద్యార్థి
- చిట్యాలలో ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



పోలీసుల అదుపులో ఉన్న చరణ్

భూదాన్‌పోచంపల్లి: హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక ఓ విద్యార్థి గురుకుల పాఠశాల నుంచి పారిపోగా.. చిట్యాలలో ఆచూకీ లభించడంతో పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. నార్కట్‌పల్లి మండలం నెమ్మాని గ్రామానికి చెందిన రూపని వెంకన్న తన ఇద్దరు కుమారులైన చరణ్(14)ను ఎనిమిదవ తరగతిలో, గౌతమ్(12)ను ఆరో తరగతిలో పోచంపల్లి మండలంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో చేర్పించాడు. గురుకుల పాఠశాలలో ఉండి చదువుకోవడంపై చరణ్ మొదటి నుంచి అయిష్టంగా ఉన్నాడు. గత వారం క్రితం వెంకన్న వీరిని ఇంటికి తీసుకెళ్లి నచ్చజెప్పాడు. మంగళవారం వీరిద్దరిని తీసుకొని స్కూల్‌కు పంపించి ఇంటికి వెళ్లాడు. అదే రోజు మధ్యాహ్నం లంచ్ సమయంలో చరణ్ ఎవరికీ చెప్పకుండా స్కూల్ నుంచి పారిపోయాడు. అటుగా వెళ్తున్న ఓ వ్యకి బైక్‌ను లిఫ్ట్ అడిగి దేశ్‌ముఖి నుంచి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు వరకు, అనంతరం అక్కడ నుంచి ఎల్‌బీనగర్‌కు చేరుకున్నాడు. రాత్రంతా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పడుకున్నాడు. బుధవారం ఉదయం చిట్కాల వైపు వెళ్తున్న ఓ వ్యక్తి బైక్‌ను ఆపి, లిఫ్ట్ అడిగి చిట్యాలలో దిగాడు. అయితే.. తన అన్న కనిపించడం లేదని గౌతమ్ అప్పటికే స్కూల్ ప్రిన్సిపాల్‌కు, ఇటు తండ్రికి సమాచారం ఇచ్చాడు. చుట్టుపక్కన వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వెంకన్న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. తప్పిపోయిన చరణ్ ఫొటో, వివరాలను పలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. బుధవారం చిట్యాలలో బైక్ దిగిన చరణ్ నడుచుకుంటూ వెళ్తుండగా, తెలిసిన వ్యక్తి అతడిని గుర్తించి వెంకన్నకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. దీంతో బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చౌటుప్పల్: మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగుల మండలం గుర్రప్పగూడెం గ్రామానికి చెందిన సుంకిరెడ్డి మధుకర్‌రెడ్డి (36) బత్తాయిపండ్ల వ్యాపారం చేస్తుంటాడు. వాటిని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడలోని పండ్ల మార్కెట్‌లో విక్రయిస్తుంటాడు. అందులో భాగంగా స్థానికంగా కొనుగోలు చేసిన పండ్లను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని మంగళవారం ట్రాక్టర్ డ్రైవర్ మల్లె వెంకట్‌రెడ్డితో కలిసి మార్కెట్‌కు బయలుదేరాడు. ఈక్రమంలో తూప్రాన్‌పేట గ్రామ శివారులో జాతీయ రహదారిపై అర్ధరాత్రి దాటాక వెనుక నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మధుకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి సత్తిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ రెడ్డి తెలిపారు.

కేసు నమోదు చేస్తారనే భయంతో..

- పోలీస్‌స్టేషన్ ఎదుట యువకుడు ఆత్మహత్యాయత్నం

నేరేడుచర్ల: వ్యవసాయ పొలం వద్ద జరిగిన వివాదంలో తనపై పోలీసులు కేసు నమోదు చేస్తారని ఆందోళన చెందిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం బూర్గులతండా గ్రామ పంచాయతీకి చెందిన లావూరి భారతి, మాలోతు మంగ్లీలకు చెందిన వ్యవసాయ భూమి పక్కపక్కనే ఉంది. ఈనెల 4వ తేదీన వ్యవసాయ పొలం వద్ద వరం తీసిన విషయంలో తలెత్తిన వివాదంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం లావూరి భారతి నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఈమేరకు స్టేషన్ వద్ద ఇరువర్గాల పెద్ద మనుషుల మధ్య చర్చ జరుగుతుండగా భారతి కుమారుడు అయిన నరేందర్ తన తల్లిపై మంగ్లీ కుమారుడు అనిల్ దాడికి పాల్పడ్డాడని, ఎట్టిపరిస్థితుల్లో అనిల్‌పై కేసు నమోదు చేయాలని పట్టుబట్టాడు. దీంతో తనపై ఎక్కడ పోలీసు కేసు నమోదు చేస్తారేమోనని అనిల్ భయంతో ఆందోళనకు గురయ్యాడు. తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు బాటిల్ మూత తీసి తాగే ప్రయత్నం చేయగా అప్రమత్తమైన హోంగార్డు బాటిల్‌ను లాక్కున్నాడు. అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అవార్డుల ప్రదానం

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని పీపుల్స్‌ప్లాజాలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట రాష్ట్రస్థాయి చేనేత పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పురస్కారానికి ఎంపికైన భువనగిరి జిల్లాకు చెందిన చేనేత కార్మికులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అవార్డులు అందజేశారు.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మోత్కూర్‌కు చెందిన కొక్కుల సత్యనారాయణ



గడ్డం బాలయ్య, కొయ్యలగూడెం గ్రామం



పున్న సత్యనారాయణ, చౌటుప్పల్



ఎన్నం మాధవి, భూదాన్‌పోచంపల్లి



కందగట్ల ఆదినారాయణ, బోగారం గ్రామం

భూ సమస్యలు ఏకరువు

- ఏళ్లుగా భూ సమస్యలు పరిష్కారం కాలేదని రైతుల ఆవేదన
- గత ప్రభుత్వ హయాంలో సర్వేల పేరుతో కాలం వెళ్లదీశారని ఆందోళన
- ఈ సారైనా సమస్యలు పరిష్కరించాలని వినతి
- భూసమస్యల పరిష్కారం కోసం చింతలపాలెంలో గ్రామసభ



చింతలపాలెం గ్రామ సభలో మాట్లాడుతున్న నవీన్ మిట్టల్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): సంవత్సరాలు గుడుస్తున్నా భూ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి ఎంజాయిమెంట్ సర్వేలతోనే సరిపుచ్చింది తప్ప పట్టాలు ఇవ్వలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు గాను క్షేత్రస్థాయి అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. అందుకోసం నూతన ఆర్‌ఓఆర్ చట్టాన్ని తీసుకురానున్న నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారానికి గాను నల్లగొండ జిల్లాలో తిరుమలగిరి(సాగర్) మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. అందులో భాగంగా బుధవారం చింతలపాలెం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు రాష్ట్ర రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, భూ పరిపాలన చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్.. ధరణి కమిటీ మెంబర్స్ లచ్చిరెడ్డి, భూమి సునీల్, నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి హాజరయ్యారు. చింతలపాలెం, నెల్లికల్లు, తిమ్మయ్యపాలెం, జమ్మనకోట, యల్లాపురం, తునికినూతల గ్రామాల్లో భూసమస్యలు తీవ్రంగా ఉన్నట్లు కలెక్టర్ చెప్పారు. ఆ తరువాత రైతులు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వగా.. రైతులు అధికారుల ముందు గోడు వెల్లబోసుకున్నారు. తమ ముత్తాతలు, తాతలు, తండ్రులు ప్రస్తుత తాము కబ్జాలో ఉన్న భూములకు ప్రభుత్వాలు హక్కు పత్రాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాలో ఒకరు ఉంటే పట్టా మరొకరి పేతో ఉందని, రికార్డులో ఒకరు ఉండే కబ్జాలో మరొకరు ఉన్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ, ఫారెస్ట్ భూములకు బౌండరీలను ఏర్పాటు చేయకపోవడంతో ఫారెస్ట్ అధికారులు తమ పొలాల్లోకి వచ్చి సాగు చేసిన పంటలను ధ్వంసం చేస్తున్నారని చెప్పారు. రైతుల సమస్యలను విన్న అధికారులు.. గతంలో జరిగిన తప్పులనే తాము సవరించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కరిస్తామని చెప్పి వెళ్లిపోయారు.

ధరణి వచ్చిన తరువాతనే భూములు కోల్పోయినం



మాకు 2005లో అప్పటి ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి తరువాతనే మా పట్టాలు లేకుండా పోయాయి. 2018లో గత ప్రభుత్వం ఎంజాయిమెంట్ సర్వే నిర్వహించింది. కానీ పట్టాలు మాత్రం ఇవ్వలేదు. ప్రభుత్వం రైతులకు అందించే రైతుబంధు ఇప్పటి వరకు 12 సార్లు కోల్పోయినం. ఇప్పటికైనా భూమి మీద ఉన్న వారిని గుర్తించి పట్టాలు ఇవ్వాలి.

– మేరావత్ మునినాయక్, రైతు, నాయకునితండా

పూర్తిస్థాయిలో సర్వే చేయాలి



అధికారులు, ప్రభుత్వం ఇప్పటికైనా పూర్తిస్థాయిలో సర్వే చేస్తేనే నిజమైన లబ్ధిదారులను న్యాయం జరుగుతుంది. అధికారుల తప్పిదం వలన కబ్జాలో ఉన్నవారికి పట్టాలు లేవు, రికార్డుల్లో ఉన్నవారు కబ్జాలో లేరు. కబ్జాలో లేని వాళ్లకు గతంలో అధికారులు పట్టాలు ఇవ్వడంతో గ్రామాల్లో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. భూమి అమ్ముకున్న రైతులకు కూడా ఇప్పటి వరకు రికార్డుల్లో వాళ్లే వస్తున్నారు.

– బూడిద కొండలు, రైతు, గోడుమడక

పథకాలు అందడం లేదు



మా భూములను పార్ట్-బిలో పెట్టడం వలన 1బీలు, పహణీలు రావడం లేదు. దీంతో గతంలో తీసుకున్న బ్యాంకు రుణాలు మాఫీ చేసుకోవడానికి, కొత్తగా రుణాలు తీసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. ఫారెస్ట్, రెవెన్యూ భూములకు బౌండరీలు లేకపోవడంతో ఫారెస్ట్ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. మేము ముంపు బాధితులం, ఐదు తరాలు మారినా మా పేరు మీద మాత్రం గుంట భూమి కూడా ఎక్కలేదు.

: శ్రీను నాయక్, నాగార్జునపేటతండా

ధరణిలో మా పేర్లు రావడం లేదు



గతంలో మాకు పట్టాలు ఇచ్చారు. కానీ గత ప్రభుత్వ హయాంలో మా పట్టాలను రద్దుచేశారు. దీంతో ధరణిలో మా పేర్లు రావడం లేదు. భూమి లేనివారికి పట్టాలు ఉన్నాయి. వారికి రైతుబంధు, రైతు బీమా, రుణాలు సైతం ఇస్తున్నారు. అర్హులైమన మేము మాత్రం ప్రభుత్వం అందించే పథకాలకు దూరం అవుతున్నాం.

– మారయ్య, రైతు

సర్వే చేసినా పట్టాలు ఇవ్వలేదు



గత 50 సంవత్సరాల నుంచి మా ముత్తాత, తాత, తండ్రుల నుంచి ప్రభుత్వ భూమిని సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నాం. 223 సర్వే నెంబర్‌లో నాలుగు ఎకరాల 18 గుంటల భూమిని ప్రభుత్వం సర్వే చేసి హద్దులు చూపించింది. కానీ ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదు. పలుమార్లు అధికారులను కలిస్తే ఆర్‌ఎస్‌ఆర్ (రీ సెటిల్‌మెంట్ రిజిస్టర్) ఖాళీ లేనందున మీ భూమికి పట్టాలు ఇవ్వలేమని అధికారులు అంటున్నారు.

– పెదమాము కాశయ్య, రైతు, చింతలపాలెం

ఈసారైనా మాకు న్యాయం చేస్తారా



ఎన్నో ఏళ్లుగా మా భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రతిసారి అధికారులు సర్వే పేరుతో వస్తున్నారు పోతున్నారు తప్ప మాకు మాత్రం పట్టాలు ఇవ్వడం లేదు. ప్రభుత్వం అందించే రైతు బంధు, రైతుబీమా వంటి పథకాలు అందకుండా పోతున్నాయి. చింతలపాలెం శివారులోని అన్ని సర్వే నెంబర్లలో సమస్యలే ఉన్నాయి. చింతలపాలెం సీతారామచంద్ర స్వామి దేవస్థాన భూమి టెయిల్‌పాండ్ కింద 7.31 ఎకరాల భూమిని కోల్పోయినా నేటికీ డబ్బులు అందలేదు.

– చిన రామయ్య, రైతు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ నల్గొండ జిల్లా చౌటుప్పల్‌లో HMDA & RERA అప్రూవుడ్ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లో 140 అమినిటీస్‌తో ఓపెన్ ప్లాట్లు అమ్మబడును. సంప్ర॥ కాట్రపల్లి నాగరాజ్, 9399342239. [M-1185377]

Services

■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టి మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342 [T-270]

WATER PROOFING

■ మీరు వాటర్ లీకేజీ సమస్యలతో బాధపడుతున్నారా? మీ ఇంట్లో స్లాబ్, వాటర్ ట్యాంక్స్, Out side క్రాక్ బాత్‌రూమ్స్ ఏ ఇతర లీకేజీలు అయినా ఆధునాతన కెమికల్స్‌తో 10 సం॥ గ్యారంటీతో. 99887 73737. [M-1185279]

Wanted

■ Wanted Social teacher to teach high school level (English medium in nalgonda town contact : 7981300357 [YA-15555]

■ YIP PVT LTD recruits Male of Female Age 18 to 45, Qul:- 10th to Any Degree, Salary 18000 and above work from home facility is available 8121818692 [G-8984]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం 18K ఫోన్: 9160900024, 9640400073 [H-796264]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.